## క్లుప్తంగా

### కసాపురంలో ధన్వంతరి హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని కోరుకుంటూ ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ధన్వంతరి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం ధన్వంతరీ హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

### కంటి వైద్య శిబిరం

యాడికి: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం యాడికి ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కర్నూలుకు చెందిన ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్లు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 80 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి కర్నూలులో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాధంశెట్టి బలరామయ్య, ఆర్యవైశ్యులు తెలిపారు. ఈసందర్భంగా శిబిరానికి హాజరైన వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు.

### బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ రామాంజనేయులు

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన హరి అనే యువకుడు బెంగళూరు సెయింట్ జోసెఫ్ ఆస్పత్రిలో కాలుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొని అక్కడే ఉన్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ రామాంజనేయులు గురువారం బెంగళూరులోని ఆస్పత్రికి వెళ్లి రూ.3,000 పింఛన్ అందించారు. గ్రామస్తులు, నాయకులు, అధికారులు వలంటీర్‌ను అభినందించారు.

### 'రోడ్డు మరమ్మతు ఎలా చేస్తారో చూస్తా?'



వివరాలు సేకరిస్తున్న డీఈ శ్రీధర్‌రెడ్డి

పెద్దపప్పూరు: ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించడమేగాక మీరు ఎలా రోడ్డు మరమ్మతు చేపడతారో చూస్తానంటూ పసలూరు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరుడు పయ్యావుల కేశవనాయుడు, అతని భార్య గురువారం సాయంత్రం అధికారుల ఎదుట హల్‌చల్ చేశారు. వివరాలిలా..పసలూరు నుంచి కొట్టాపల్లి నరసింహస్వామి గుడి వరకు రోడ్డు గుంతలమయమైందని ఇటీవల ప్రజాసంక్షేమ పాదయాత్రలో ఆగ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈమేరకు రోడ్డు పనులు ప్రారంభించగా కేశవనాయుడు పనులను అడ్డుకున్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీధర్ రెడ్డి రోడ్డు భూమిని ఆక్రమించినట్లు తెలుస్తోందని, హద్దులు ఏర్పాటు చేసి పనులు చేస్తామన్నారు. పనులకు ఆటంకం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పేదలకు వైద్యం భారం కారాదు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: పేదలకు వైద్యం భారంగా మారకూడదన్న ఉద్దేశంతో వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఉన్న చోటునే అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రారంభించారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం ఆయన వెంకటాంపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరిగేవారన్నారు. అతి ఖర్చుతో కూడుకున్న పెద్దపెద్ద వైద్యానికయ్యే ఖర్చుకు ఆర్థికస్థోమత లేక పేదోళ్లు బలయ్యేవారన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో వైద్యం అన్ని వర్గాల ప్రజలకు అతి చేరువైందన్నారు. కానీ గ్రామాల నుంచి చిన్నచిన్న రోగాల కోసం సమీపంలో ఉండే పట్టణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వెళ్లకుండానే డాక్టర్లే గ్రామాలకు వచ్చి వైద్యం అందిస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహణకు సంబంధించి 104 వాహనానికి వైద్యులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, వైద్యులు శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గడప గడపకూ ఉచిత వైద్యం**

గుంతకల్లు రూరల్: గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను చేరవేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు గడప గడపకూ వెళ్లి ఉచిత వైద్యం అందించేలా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డాక్టర్ చెన్నకేశవులు పేర్కొన్నారు. గురువారం కసాపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య విధానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీవీ మాధవి, సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, జెడ్పీటీసీ కదిరప్ప, మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్ కుమార్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం, డీపీఎంవో డాక్టర్ చెన్నకేశవులు హాజరై మాట్లాడారు. వైద్యం కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా నేరుగా వారి ఇంటి వద్దకే వెళ్లి మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వైద్య సేవలో విధానంలో నూతన విధానానికి నాంది పలికారని తెలిపారు. ఇకపై ప్రజలు ఎవరూ కూడా అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని, నేరుగా వైద్యుడే మీ ఇంటి వద్దకు వచ్చి అవసరమైన వైద్యం అందజేస్తారని తెలియజేశారు. వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కేక్ కట్ చేస్తున్న మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీల యాదవ్

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లి ఎస్సీ కాలనీలో మహిళా సంఘాల సభ్యులు గురువారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మూడో విడత నగదు జమ చేయడంపై మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గుత్తి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీల యాదవ్ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాల రుణాలను మాఫీ చేసి ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. నవరత్న పథకాల ద్వారా అన్ని కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, అనిమేటర్ లక్ష్మీదేవి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పరిశ్రమల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



గ్రానైట్ పరిశ్రమల యజమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి: తాడిపత్రిని పారిశ్రామికంగా అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఇందుకోసం ఎంత దూరమైన వెళతానని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. తాడిపత్రి గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు బుధవారం రాత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. తాడిపత్రి ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమ యజమానులు ప్రధానంగా ఎదుర్కొంటున్న ఎండీఎల్ నంబర్, స్లాబ్ విధానం తదితర సమస్యలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇటీవల సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ చూపిన విషయం తెలిసిందే. ఇందుకు కృతజ్ఞతగా గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈసందర్భంగా పరిశ్రమల యజమానులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతోనే తాడిపత్రి పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించిందననారు. గ్రానైట్, నాపరాతి పరిశ్రమలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అలాంటి పరిశ్రమలు మూతపడితే ఊరుకునేది లేదన్నారు. గ్రానైట్, నాపరాతి పరిశ్రమల యజమానులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా పరిశ్రమల యజమానులకు భరోసా ఇచ్చారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు జగదీశ్వర్‌రెడ్డి, ఉపేంద్ర, వంకదారి రాజా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ

పుట్లూరు: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎల్‌డీఓ ఓబుళమ్మ తెలిపారు. గురువారం ఆమె మండలంలోని కందికాపుల, బాలాపురం, కోమటికుంట్ల గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. అనంతరం గర్భిణులు, పిల్లల వివరాల నమోదుపై ఆరా తీశారు. అలాగే జల్ జీవన్ మిషన్, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### సజావుగా పదో తరగతి పరీక్షలు

యల్లనూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. గురువారం హిందీ పరీక్షకు యల్లనూరు హైస్కూల్లో 200 మందికి గాను 19మంది విద్యార్థులు, చిలమకూరు ఆదర్శ పాఠశాలలో 156 మందికిగాను 155 మంది హాజరైనట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

గార్లదిన్నె: పదో తరగతి పరీక్షలు గురువారం సజావుగా జరిగాయి. గార్లదిన్నె జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో 633 మంది విద్యార్థులకు 625 మంది విద్యార్థులు హాజరయ్యారు. పెద్దవడుగూరు : మండల కేంద్రంలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షకు ఏడుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ రాముడు తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 303 మందికి 299 మంది, శ్రీసరస్వతి హైస్కూల్ లో 168 మంది కి గానూ 165 మంది హాజరయ్యారన్నారు.

యాడికి: మండలంలో గురువారం 4 కేంద్రాల్లో 777 మంది పదవ తరగతి విద్యార్థులు హిందీ పరీక్ష రాయాల్సి ఉండగా 765 మంది హాజరైనట్లు ఎంఈఓ కాశెప్ప తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ కల్యాణదుర్గం ఎంఈఓ విజయకుమారి, యాడికి తహసీల్దార్ అలెగ్జాండర్ తనిఖీ చేశారు.

# కమనీయం..సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున వెలసిన అతి పురాతనమైన కోదండ రామాలయంలో గురువారం సీతారాముల వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన కల్యాణ మండపంలో పట్టువస్త్రాలు, సర్వాభరణాలతో ముస్తాబైన శ్రీసీతారాముల కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురప్రముఖులు, భక్తాదులు సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మఠం మల్లికార్జున కల్యాణమహోత్సవంలో పాల్గొన్న దంపతులకు శ్రీస్వామివార్ల శేషవస్త్రం, జాకెట్‌పీస్, కల్యాణం అక్షింతలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు ఎ.వి.రాజేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నను సీఎం చేయడమే ధ్యేయం



బసినేపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: వచ్చే ఎన్నికల్లో జగనన్న ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని సచివాలయాల మండల కన్వీనర్ సుభాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్దన్‌రెడ్డి సూచించారు. గురువారం బసినేపల్లి సచివాలయంలో వలంటీర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల మండల కన్వీనర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం నుంచి చేపట్టనున్న మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. గృహ సారథులు, వలంటీర్లు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకుడు లాలూనాయక్, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పామిడి: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రూరల్ సచివాలయాల కన్వీనర్ ఎం కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఎద్దులపల్లి గ్రామ సచివాలయంలోనూ, రామగిరి ప్రభుత్వ పాఠశాలలో వేర్వేరుగా నిర్వహించిన జగనన్న మీరే మా భవిష్యత్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

గుత్తి: పట్టణంలోని కోట సచివాలయాల్లో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లను వైఎస్సార్ సీపీ నాయకులు విడుదల చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, సచివాలయ పట్టణ కన్వీనర్ రంగస్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు నజీర్, మర్తాడు హసీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్ రంగస్వామి మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

### ఇంధన పొదుపు చర్యలు చేపడదాం



మాట్లాడుతున్న కమిషనర్ బండి శేషన్న

గుంతకల్లుటౌన్: నేటి సాంకేతిక యుగంలో అభివృద్ధి విద్యుత్‌తో ముడిపడి ఉందని, విద్యుత్ ఆదా మార్గాలను అనుసరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఎస్ఈసీఎం అధికారి శశిధర్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం) ఆధ్వర్యంలో విద్యుత్ ఆదాపై గుంతకల్లు, గుత్తికి చెందిన వార్డు సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు, ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాల్లో ఎల్ఈడీ బల్బులను వీధి దీపాలుగా వినియోగించడం వల్ల గణనీయంగా విద్యుత్ పొదుపు సాధ్యమైందన్నారు. ఇంధన సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎంఈ విశ్వనాథ్, లైటింగ్ సెక్షన్ ఏఈ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

# వైభవంగా వీరహనుమాన్ విజయయాత్ర



ర్యాలీలో పాల్గొన్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు

గుంతకల్లుటౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్ర(బైక్ ర్యాలీ) వైభవంగా జరిగింది. ఆంజనేయస్వామి చిత్రపటంతో స్థానిక బీరప్పగుడి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం వరకు సాగింది. వీహెచ్‌పీ కార్యకర్తలు కాషాయ జెండాలను చేతపట్టుకుని జైశ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో మద్దికెరకు చెందిన శ్రీసూర్యానంద ఆశ్రమ పీఠాధిపతి సూర్యానంద స్వామి, భజరంగ్‌దళ్ రాష్ట్ర సప్తహిక్ కన్వీనర్ సి.రవి, వీహెచ్‌పీ ప్రాంత సేవాప్రముఖ్ డాక్టర్ రామ్మూర్తి, వీహెచ్‌పీ జిల్లా ధర్మప్రచారక్ ప్రముఖ్ గద్వాల్ ప్రతాప్, పట్టణ కార్యదర్శి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు మాణిక్‌చంద్ కార్వా, రంగస్వామి, శ్రీనివాసులు, మురళీ, బీజేపీ నాయకులు శేఖన్న, కొలిమి రామాంజి, పురంధర్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



సీతా స్వయంవర అలంకారంలో శ్రీరాముడు

తాడిపత్రి అర్బన్: శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏటిగడ్డ పాలెంలోని స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం శ్రీరాముడు సీతా స్వయంవర అలంకారంలో దర్శనమిచ్చాడు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

పామిడి: ఖాదర్‌పేట గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన సచివాలయ రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. విధుల్లో తప్పక సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అనుంపల్లిలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలను ఆయన పరిశీలించారు. భవన నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# అశ్వత్థంలో నారాయణుడి కల్యాణం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: చైత్రమాసం పౌర్ణమి సందర్భంగా గురువారం అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా క్షేత్రంలో స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత నారాయణ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ముస్తాబుచేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఈఓ సుబ్రహ్మణ్యం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని చిన్న అశిత్తయ్య ఆశ్రమంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆశ్రమం నిర్వహకులు చింతా మోహన్ దాసు, పురుషోత్తం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు 24వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు'**

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 24వ వార్డులో శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**నేడు పొడరాళ్లలో...**

బుక్కరాయసముద్రం: పొడరాళ్ల గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్నే భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరాయి.

తాడిపత్రి: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం వర్గాలు కోరాయి.

**వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి**

గార్లదిన్నె: మండలంలో వివిధ గ్రామాల్లో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరైన రైతులు వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం ఉండి కుటుంబంలో ఎవరైనా చనిపోయి, పట్టాదారు పాసుపుస్తకం మార్చుకున్న, కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం మంజూరైన వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలతో ఆర్బీకేలో వీఏఏ, వీహెచ్ఏల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**మహిళ ఆత్మహత్యాయత్నం**

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డిలో ఓ మహిళ గురువారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శశికళ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న శశికళను గమనించిన కుటుంబసభ్యులు గుత్తి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**నేడు రంజాన్ తోఫా పంపిణీ**

తాడిపత్రి అర్బన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఫయాజ్‌బాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేత హీరాపురం ఫయాజ్‌బాషా శుక్రవారం చిన్న బజార్‌లోని తన 5వ నంబర్ బీడి ఫ్యాక్టరీలో తాడిపత్రిలోని అన్ని మసీదులకు చెందిన ఇమామ్‌లు, మౌజన్లకు రంజాన్ తోఫాలను పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క మసీదుకు రూ.10 వేలు, ఇమామ్‌కు రూ.6,500, మౌజన్లకు రూ.3,500 చొప్పున పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

**వ్యక్తికి గాయాలు**

గుత్తి రూరల్: రజాపురం గ్రామంలో గురువారం ఎనుములు దూసుకొచ్చి ఓ వ్యక్తి గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటస్వామి ఇంటి నుంచి బయటకు వెళ్తున్న క్రమంలో రెండు ఎనుములు పొట్లాడుకుంటూ వెంకటస్వామి వైపునకు దూసుకొచ్చాయి. భయంతో పరుగు పెట్టిన వెంకటస్వామి కాలుజారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**ఇసుక ట్రాక్టర్ల సీజ్**

తాడిపత్రి అర్బన్: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం సెబ్ అధికారులు సీజ్ చేశారు. సంజీవనగర్‌కు చెందిన షాషావలి, కమ్యూనిస్టు కొట్టాలకు చెందిన వడ్డే శ్రీరామ్ ఎటువంటి అనుమతులు లేకుండా పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని సీజ్ చేసి ట్రాక్టర్లను పట్టణ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

**ఉపాధి పనులు కల్పించండి**

యల్లనూరు: మండలంలోని జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలని ఏపీఓ షబ్బీర్‌బాషా తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి 100 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీలో పనులు గుర్తించి కూలీలు వలసలు వెళ్లకుండా చేయాలన్నారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం**

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో గురువారం బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడునారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.

**'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తుల ఆహ్వానం**

గుత్తి: మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తల్లిదండ్రులు కోల్పోయినా, తల్లిని లేదా తండ్రిని కోల్పోయినా, విడాకులు తీసుకున్న తల్లి పిల్లలు మిషన్ వాత్సల్యకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ పథకం కింద నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

**వ్యక్తి మృతి**

గుత్తి రూరల్: తురకపల్లిలో ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలు.. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ ఓబులేసు (40) ఈ నెల 2న వంట చెరుకు తీసు కొస్తానని ఇంట్లో చెప్పి సమీప అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగిరాక పోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఎక్కడా అతడి అచూకీ లభించలేదు. కాగా గురువారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ నీటి కుంట వద్ద ముళ్లకంపల వద్ద పడి ఉన్న ఓబులేసు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**లోకేష్ పాదయాత్రలో ఒక్క హామీ ఇచ్చావా?**

బుక్కరాయసముద్రం: 'టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ పాదయాత్రలో ప్రజలకు అవసరమయ్యే ఒక్క హామీ అయినా ఇచ్చావా అని' వైఎస్సార్ సీపీ నాయకుడు మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్రలో కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

**విద్యార్థికి గాయాలు**

గుత్తి: ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడిన ఓ విద్యార్థి తలకు తీవ్ర గాయమైంది. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి పట్టణానికి చెందిన కళ్యాణ్‌కుమార్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం పరీక్ష రాసేందుకు గుత్తి ఆర్ఎస్‌లోని కేంద్రానికి వెళ్లాడు. పరీక్ష ముగిసిన తర్వాత ద్విచక్ర వాహనంపై వెళుతూ మాజీ ఎమ్మెల్యే మధుసూదనగుప్త ఇంటి సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తలకు తీవ్రగాయమైన కళ్యాణ్‌కుమార్‌ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.